**1943–44 సంవత్సరాల్లో** భరద్వాజ (మాటల్లో ఇప్పటికీ) విద్యార్థి. అంతకు కొంచెం ముందుగానే - అతను చదువు కోవటం ప్రారంభించాడు. ఆ చదువు పూర్తిగా వంట పట్టిం దనుకోనవసరం లేదు; వంట పట్టించుకోవడం కోసం అతడు పడిన శ్రమ, చేసిన కృషి - ఒక నవల వ్రాయడానికి పనికొచ్చేటంతగా ఉన్నది. ఇంతవరకూ జరిపిన పరిశోధనల్లో- మూరు మూలన పడివున్న రెండు మూడు రచనలు వెలుగు లోకి వచ్చాయి. నిజమేగానీ ఇవి పరమ జటిలంగానూ, అసం పూర్ణంగానూ ఉన్నాయి. సుమారుగా నలభై సంవత్సరాల క్రిందటి కాగితాలేమో అవన్నీ నుగ్గు నుగ్గు అయినాయి. కొన్ని కాగితాలను సగానికి సగం పురుగుల తినేశాయి. కొన్ని పేజీలు లేవుకూడా.

ప్రస్తుతానికిది భరద్వాజ తొలి వచన రచనగా మనం భావిద్దాం. దీనికొక శీర్షిక లేదు. ఇది వ్రాసినప్పుడు తను ఏ శీర్షి కను ఉంచిందీ భరద్వాజ చెప్పలేక పోయాడు. తాను ఏమి వ్రాయదలచుకున్నదీ తనకిప్పుడు గుర్తురావడం లేదన్నాడు.

ఇది - చారిత్రక మన్న భ్రాంతిని కలిగించే జానపద గాథ. దీనిని వ్రాసినప్పటి భరద్వాజకు కథా కథనం ముఖ్యం కాదు భాష ముఖ్యం; శబ్దాడంబరం ముఖ్యం! ఎంత జటిలంగా క్లిష్టంగా కష్టంగా రాస్తే అంత గొప్ప రచన అన్న భ్రాంతికి అందరి కవుల్లాగా, రచయితల్లాగా ఆయనా లొంగిపోయాడు.

అప్పటికి అతని వయస్సు 16-17 సంవత్సరాలు. బాల్యం వదిలి యవ్వన ప్రాంగణంలో అడుగు మోపుతున్న సంధికాలం. అవమాన ప్రహారానికి గురి అయ్యి నిలువునా రోషాన్ని నింపుకొన్న కాలం. పుస్తకాలనే పీల్చి, పుస్తకాలనే తాగి, పుస్తకాలనే తిని బతుకుదామని సంకల్పించిన కాలం. ఆ సంకల్పాన్ని కొంతకు కొంత ఆచరణలోకి గుంజుకొచ్చి పడేసిన కాలం. కనుకనే ఈ రచయిత తొలినాళ్ళలోని తొట్ట తొలి రచనలలో మనకు భాషాడంబరమే కనిపిస్తుంది. ప్రబంధాలలోని, మహాకావ్యాలలోని అనేక పంక్తులు యథా తథంగానూ, అప్పుడప్పుడు వేషాలు మార్చుకొనీ మనకు కనిపిస్తాయి.

ఎందుకిలా జరిగిందో, ఎందుకిలా జరుగుతుందో ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. ఏదో రాయాలన్న తపన, రాయడానికి ఏమీ స్ఫురించనిస్థితి, చేతకాకపోవడమూ; వీటి మధ్య ఇరుక్కున్న కవికిగాని రచయితకుగాని ఇటు వంటివి సంభవించడం సహజం. మరీ ఖచ్చితంగా చెప్పాలంటే

ఇటువంటివే సంభవిస్తాయి. దీన్ని 'బాల్య దశ' అనవచ్చు. బిడ్డకు నడవాలని వుంటుంది, నడవడం చేతకాదు, నడవ కుండా వుండగలగడం ప్రకృతికే విరుద్ధం. ఏ గోడనో, గొబ్బెనో, మంచాన్నో, కుంచాన్నో పుచ్చుకొని, పడకుండా ఆసరా చేసుకొని, నడవడం నేర్చుకొని, నేర్చుకొన్నాక ఆ ఆసరాలను వదులుకొని, సొంతంగా నడవడం సర్వసాధారణం.

ఈ పరిణామ క్రమాన్ని, పరిణామ వేగాన్ని తెలుసు కొనగోరేవారి ఉపయోగార్థం - ఇది అసంపూర్ణమే అయి నప్పటికీ - ఇప్పటికి దొరికిన వాటిల్లో మొట్ట మొదటి దయిన భరద్వాజ వచన రచనను ఇక చదవండి.]

## " ? ? "

**ఆర్యావర్తమున** స్వర్ణముఖి యను 1 ద్వీపవతీ తటాం చలమున సుధానిధి యనం బరగు మహానగర మొండు గలదు. అందలి సౌధ సుధా ప్రభ లంబర చుంబితములు........................

[ఇది ప్రారంభం. ఇక్కడి నుండి మిగిలిన ముప్పావు కాగితాన్ని పురుగులు తినేశాయి. రెండవ పేజీ ఏమయిందో తెలియదు. మూడవ పేజీలో మిగిలిన పంక్తుల్నిక్కడ

ఇవ్వడమయింది. 'యాతడు' అని ప్రారంభం కావడానికి ముందు యెంతో కొంత కథ జరిగి వుండాలి. కథ కాకపోతే- పుర వర్ణనం లేదా వన వర్ణనం లేదా మరొకటో ఉండి ఉండాలి. అది ఏమిటో మనకు తెలియదు.]

...యాతడు 2 నవద్వయ ద్వీప నానా జయశ్రీ వధూటీ సమాశ్లిష్ట భుజుడని కీర్తిఁ గాంచినవాఁడు. అంతియేఁగాక 3 అవి తోర్వీ నవఖండ ఖండపరశు జ్యాభోగి, సాభోగ, భోగ విభాస్వద్భుజ దండ మండితుడని వంది...

---

1. చూడండి : అల్లసాని పెద్దన రచించిన స్వారోచిష మనుసంభవం.
   వరణా ద్వీపవతీ తటాంచలమునన్ వప్రస్థలీ చుంబితాం
   బరమై సౌధ సుధా ప్రభా ధవళిత ప్రాలేయ రుఙ్మండలీ...

2. చూడండి : శ్రీనాథుని శృంగార నైషధం.
   వితత నవద్వయ ద్వీప నానా జయశ్రీ
   వధూటీ సమా శ్లిష్ట భుజుడు...

3. చూడండి : రామరాజ భూషణుని వసుచరిత్ర.
   అవితోర్వీ నవఖండ ఖండపరశు జ్యాభోగి సాభోగ భో
   గ విభా స్వద్భుజ దండ, దండధర దీక్షా రూక్ష నానా విప
   క్ష విక్షేపక కాండ...

[మళ్ళీ పేజీలు లేవు...దాదాపుగా నాలుగైదు పేజీలు తప్పిపోయి ఉండాలి. 'ఇన్ని పేజీలు తప్పిపోయాయి' అని ఖచ్చితంగా చెప్పేటందుకు పేజీలమీద సంఖ్యలు కూడా లేవు. కాకపోతే 'సరిపోవచ్చు' నని నేను భావించిన రీతిలో పుటలను చేర్చాను. "సౌందర్యమును వర్ణింప నజునికైన దరముగాదు" అన్న పేజీ తప్ప మిగిలినవి ఇక్కడ నప్పవని నాకు తోచింది. ఇందులోని 'ముద్దుగుమ్మ' ఎవరో ఈ కాగితాల్లోని వాక్యాలను చూసి చెప్పడం సాధ్యం కాదు. ఈ 'ముద్దుగుమ్మ' పేరు కూడా తెలియదు.]

...సౌందర్యమును వర్ణింప నజునికైనఁ దరముఁగాదన్నచో నే నెంతటి వాఁడ! అయినను యోపినంతఁ జిత్రించెదఁగాక...

4 శశిబింబ మణిహేమ సౌదామనీ చయోత్కర కాంతులను, నవ లతా పుష్ప విభవంబులను, కర్పూర చందన కాశ్మీర మృగ మదమును' నేర్చి కూర్చి నేర్పున నీ ముద్దుగుమ్మ నా విరించి సృష్టించి యుండనోపు. కాదేని గాంగ సైకత స్థల...

---

4. చూడండి : నన్నెచోడ మహాకవికృత కుమార సంభవం.

శశిబింబ మణిహేమ సౌదామనీ చయో
　　త్కర కాంతులన్నియు నరసి తెచ్చి
నవలతా పుష్ప పల్లవ బిసకోమల
　　విభవంబు లన్నియు వెదకి తెచ్చి

[తరువాత పేజీలోని పై భాగం పోయింది. అడుగు ముక్క "ఆమె చంచత్పల్లవ" తో ప్రారంభమయి 'నయి యుండెను' తో ముగిసింది.]

5 ఆమె చంచత్పల్లవ కోమలాంగుళములు గలిగినట్టిదియు, సంపూర్ణ చంద్రాననయు, నంచ చ్చందన గంధియు, గంధ గజయానయు జక్రవాక స్తనియు, కించిన్మధ్యయు, తటిల్లతా విలసి తాంగియు నయి యుండెను.

[దీని తరువాత ఎన్ని పేజీలు లేవో ఆ లేని పేజీలలో వున్న కథ ఏమిటో - వూహించటం అసాధ్య మనిపిస్తున్నది. లభించిన పుటలోని తొలి వాక్యం '-డిగ్గి నిటల తటంబున నంజలి పుటి ఘటించి వీరసేనుం డిట్లనియె' అని ఉన్నది. ఎవరీ వీరసేనుడు? ఇతను రాజు అయి ఉండడు. ఎందుచేత నంటే - 'నిటలతటంబున నంజలి పుటి' ఘటించాడు. పైగా 'దేవా!' అని సంబోధించి, 'తమ యాజ్ఞ మేరకు' అని చెప్పుకు పోయాడు. ఇతడు రాజోద్యోగి గాని, రాజ బంధువు గాని అయి ఉండాలి. అసలు సుధానిధి మహా నగరాన్ని పాలించే రాజుగారి పేరేమిటి? మధ్యలో వచ్చిన

---

కర్పూర చందన కాశ్మీర మృగ మదా
మోదంబు లన్నియు ముంచి తెచ్చి
పరవాదినీ శుక పరిపుష్ట మధుకరా
రావంబులన్నియు రాచి తెచ్చి

'ముద్దుగుమ్మ' పేరేమిటి? ఈమెకూ రాజుగారికీ ఉన్న సంబంధ మేమిటి? ఈ ముద్దు గుమ్మకు ఏదో జరిగి ఉండాలి. శత్రురాజులు మాయోపాయంతో ఆమెను తస్కరించారా? వన విహారానికి వెళ్ళిన ఆ చిట్టి తల్లి దోవ తప్పి పోయిందా? ఏ దేవతలో గంధర్వ కుమారులో ఆమెను తమ లోకాలకు తీసుకు పోయారా? ఇలాంటి దేదో ఒకటి జరిగే ఉంటుందని మనకు తెలుస్తూనే ఉంది. లేకపోతే - 'ఆచాన నేనాకానఁగాన' నని వీరసేనుడు అనడు. '-డిగ్గి' అని వాక్యం ప్రారంభమయింది గదా! ఏమి డిగ్గి ? రధమా ? అశ్వమా ? ఏనుగా ? అదీ తెలియదు.]

...డిగ్గి, నిటల తటంబున నంజలి పుటి ఘటించి వీరసేనుండిట్లనియె!

"దేవా! తమ యాజ్ఞమేరకు మనరాజ్యమందలి తరులను, దరులను గిరులను బరికించితిని. శత్రు రాజుల యారణ్య భూములంజొచ్చి కంటవత్తి నిడుకొని యన్వేషించితింగాని-నాచాన నేనా కానఁగాన. ఇక మరలుద మనుకొంటిని అంత 6. తళతళ మెఱుములు మెఱసినవి. బెళపెళ నుఱు

---

5. చూడండి : పిల్లలమర్రి పినవీరభద్ర కవి రచించిన శృంగార శాకుంతలం.

చంచత్పల్లవ కోమలాంగుళ కర న్సంపూర్ణ చంద్రానన
న్యంచ చ్చందన గంధి గంధగజయానం జక్రవాక స్తనిం
గించిన్మధ్య తటిల్లతా విలసి తాంగిం, బద్మ పత్రాక్షి వీ
క్షించెన్ రాజు...

ముచు బెఠిల్లున బిడుగులు, నలుగడలఁ బడ సాగినవి. నేను ఖడ్గధారినై హయము నదలించుచు, ముందునకు బోవుచుండ - దేవా! చెప్పుటకు నోరాడకున్నది. ఒక భయం...

[-కరమైన దేదో కనిపించి ఉండాలి. అది ఒక దృశ్యం కావచ్చు ; ఒక క్రూర మృగం కావచ్చు ; ఒక విష సర్పం కావచ్చు ; ఇలా ఎన్ని రకాలుగానైనా ఊహించవచ్చు. ఆ తరువాతి కాగితాలు కనిపించలేదు. మిగిలి ఉన్న ఆఖరు కాగితం మీద చదవడానికి అనువుగా ఉన్న ఒకే ఒక వాక్యం ఇదిగో ఇదీ-]

...తధిరోహిత హయరింఖా సముద్ధూత ధూళి ధూళులు రక్తచందన వృష్టులయినవి.

[ఆ తరువాత ఇంకేదో జరిగి ఉండాలి. ఆ జరిగిం దేమిటో భరద్వాజ రాసి కూడా ఉండవచ్చు. ఆ కాగితాలేవీ ప్రస్తుతానికి లేవు.]

* * *

---

6. చూడండి : పింగళి సూరనా మాత్యుని కళాపూర్ణోదయం.

తళతళ మెఱుములు మెఱయగ
బెళపెళ నుఱుముచు బెఠిల్లు పెఠిలన బిడుగుల్
నలుగడబడ, బెడిదపు ధా
రలుగల బలువాన జలధరంబులు గురిసెన్.